జిల్లాకు నిధుల్లేవ్..!

- కేంద్ర బడ్జెట్‌లో మరోసారి మొండిచేయి
- ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణకు పెద్దపీట
- విద్యుత్ సంస్కరణల అమలుకు ఊతం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/విలేకరులు

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో 2025-26 ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.50,65,345 కోట్లతో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అందులో రెవెన్యూ రాబడి రూ.34,20,404 కోట్లుగా, క్యాపిటల్ రాబడి రూ.16,44,936 కోట్లుగా పేర్కొన్నారు. ఆ బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించలేదు. మరో సారి మొండి చేయి చూపారు. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించ లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. బడ్జెట్లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.

కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం..

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని అలంపూర్ రోడ్లు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు అప్పగించేలా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. కొన్ని కార్యక్రమాలకు బడ్జెట్ ఊరట ఇచ్చినప్పటికీ ప్రధానంగా రైతు, పేద, వ్యవసాయ కూలీలకు కార్మికులకు ఈ బడ్జెట్ కూతమిచ్చేదిలా లేదనే అర్థమవుతుంది. ఆదాయపన్నులో మధ్యతరగతి ఉద్యోగులకు 10 నుండి రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇచ్చినప్పటికీ, కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసినట్లు ఉందనే భావన వ్యక్తం అవుతుంది. రాష్ట్రాల్లో విద్యుత్ సంస్కరణల అమలకు ఈ బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యుత్ సంస్కరణలను అమలు చేసే రాష్ట్రాలకు అదనంగా రూ.8 వేల కోట్లు నిధులు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడంలోనే రైతుల మెడకు ఉరితాడు వేయబోతున్నారని, ప్రజలపై విద్యుత్ బారాలువేయబోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. విద్యుత్ మీటర్లను రైతుల మోటార్లకు బిగించడంలోను, ప్రతి ఇంటికి విద్యుత్ స్మార్ట్‌మీటర్‌ను అమర్చే ప్రక్రియను వేగవంతం చేయబోతున్నట్లు స్పష్టంగా అర్థం అవుతోంది.

సామాన్యులకు ఉపయోగపడని బడ్జెట్

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

బడ్జెట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి గుండు సున్నా చుట్టింది. అంకెల గారెడీగా ఉంది. సామాన్య ప్రజలకు ఈ బడ్జెట్ నుండి ఎటువంటి ఉపయోగం లేదు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడలేదు. ఎపికి ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టు కేటాయించలేదు. వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయింపులు జరగకపోవడం తీవ్ర నిరాశ కలిగించింది. ఎపిలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలి.

రాష్ట్రానికి నిరాశే

- ఎస్‌వి.మోహన్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు

కేంద్ర బడ్జెట్ దేశవ్యాప్తంగా మధ్యతరగతి ప్రజలకు ఊరటచ్చినా రాష్ట్రానికి నిరాశ మిగిల్చింది. బీహార్ రాష్ట్రానికి నితీష్ కుమార్ సాధించిన బడ్జెట్‌ను పరిశీలిస్తే దానికన్నా తక్కువగా రాష్ట్రానికి కేటాయించడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఫలం చెందాడు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయింపుల్లో కూడా అన్యాయం జరిగింది. రాష్ట్ర విభజన హామీలు సాధించడంలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైంది.

బడ్జెట్ నిరాశపరిచింది

- యాకోబు, ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

కేంద్ర బడ్జెట్ నిరాశపరిచింది. ఉపాధి కల్పనపై స్పష్టమైన వైఖరి లేకపోగా ఆహార సబ్సిడీ తగ్గించారు. కాని ప్రభావం గ్రామీణ ప్రజలకు నష్టం కలుగుతుంది. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీల ప్రస్తావన లేదు. ప్రజలలో ఆర్థిక అసమానతలు పెరుగుతాయి. ప్రభుత్వ ఆదాయాలు పెరుగుతాయి. పబ్లిక్ సెక్టార్ యూనిట్లు బలోపేతం చేసే మాటే లేదు. బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల పెన్షన్ డివిజన్ ప్రస్తావన లేదు. ఆర్థిక సర్వేల ప్రకారం ఎన్నో ఆశలు కల్పించారు. కానీ బడ్జెట్లో నిరాశ మిగిలింది. ఇప్పటికైనా ప్రజల ఆశలు నెరవేర్చాలి.

మధ్య తరగతికి మోసం

- ఆచార్య మన్సూర్ రహమాన్, ఆర్థికవేత్త, మానవశక్తి పరిశోధనా కేంద్రం, కర్నూలు.

నికర పన్ను చెల్లింపులు రూ.25.57 లక్షల కోట్లు ఉన్నట్లు చూపడం అంటే మధ్యతరగతి ప్రజలు మోస్తున్న భారం ఇది. ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్షపన్నుల ద్వారా రెవిన్యూ పెరగడం ప్రజల కొనొగోలు శక్తిని దెబ్బతీస్తుంది. ఇది ప్రమాదకరం. ఉద్యోగ, ఉపాధి అవకాశాల ప్రసక్తి లేని బడ్జెట్‌గా దీనిని వర్ణించవచ్చు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత యిచ్చి ధన్ ధ్యాన్ యోజన ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. కిసాన్ క్రెడిట్ కార్డు పరిధిని రూ.3 నుంచి 5 లక్షలకు పెంచారు. కాబట్టి క్షామ పీడిత కర్నూలు జిల్లాలకు ప్రయోజనం జరుగుతుంది. రాష్ట్ర విభజన తర్వాత దెబ్బ తిన్న మన ఆర్థికవ్యవస్థకు ఎలాంటి చేయూత యివ్వలేదు. మన రాష్ట్రాన్ని ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించి అవమానించింది. బీహార్ రాష్ట్రం సాధించిన వాటాలో సగం కూడా మనం సాధించలేకపోయాం. కర్నూలు జిల్లాకు ప్రతిపాదిత రైల్వే ప్రోజెక్టుల ఊసే లేకుండా సాగింది ఈ బడ్జెట్. ప్రాంతీయ సమతుల్యతను ఈ బడ్జెట్ విస్మరించింది.

ప్రజా ఆమోద బడ్జెట్

- నాగరాజు యాదవ్, టిడిపి నగర అధ్యక్షులు, కర్నూలు

బడ్జెట్ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివద్ధిని పెంపొందించేలా బడ్జెట్ ఉంది. పోలవరం నిర్మాణాన్ని చేపట్టేందుకు వీలుగా పెరిగిన అంచనాలతో నిధులను కేటాయింపు చేయడం అభినందనీయం. విశాఖ ఉక్కు పరిశ్రమకు అత్యధిక నిధులు కేటాయించింది.

సీనియర్ సిటిజన్స్‌కు నిరాశే

- పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్లారెడ్డి

కేంద్ర బడ్జెట్లో సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే చార్జీల్లో రాయితీలు ఇవ్వకుండా నిరాశపరిచారు. కేంద్ర ప్రభు త్వం బడా పారిశ్రామిక వేత్తలకు అంబానీ, అదాని లాంటి కార్పొరేట్లకు బ్యాంకుల రుణాలు మాఫీ చేస్తూ అనేక రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌పై మమకారం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగ విరమణ చేసిన వారికి రాయి తీ ఇవ్వకుండా విస్మరించడం బాధాకరం. సోమవారం కర్నూలు రైల్వే స్టేషన్ వద్ద సీనియర్ సిటిజన్స్‌తో కలిసి ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్

- పి.మురళీకృష్ణ, డిసిసి అధ్యక్షులు

రాష్ట్రానికి ఒరింగిందేమి లేదు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించారు. ఎపికి చేసిందేమీ లేదు. ఇది ప్రజలను మోసం చేసే బడ్జెట్. ప్రజలు రాబోయే రోజుల్లో బిజెపిని నమ్మే పరిస్థితి లేదు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్.

మహిళా భద్రతపై ప్రత్యేక దృష్టి

- సైబర్ నేరాల నియంత్రణకు కృషి
- ఎస్పిగా విక్రాంత్ పాటిల్ బాధ్యతలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మహిళలు, చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కర్నూలు ఎస్పి విక్రాంత్‌పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్పిగా విక్రాంత్ పాటిల్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయనకు జిల్లా పోలీస్ అధికారులు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన బాధ్యతలు స్వీకరిస్తూ రికార్డులో సంతకం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనకు కర్నూలు ఎస్పిగా బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, డిజిపికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మహిళలపై, పిల్లలపై జరిగే నేరాల నియంత్రణపై ప్రధాన దృష్టి సారిస్తామన్నారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని అన్నారు. నమోదైన సైబర్ నేరాల కేసులను సేదించడమే కాకుండా సైబర్ నేరాలకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు, నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి ప్రతి గ్రామంలో ప్రజారక్షణ భద్రత పొందించడానికి వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో ప్రజలు, వాణిజ్య సంస్థలు నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ చట్టం కింద నిధులు సమీకరించి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఖర్చు చేస్తామన్నారు. ప్రతి పెద్ద నేరానికి చిన్న నేరాలు పునాది అవుతాయని, చిన్న నేరాలను తొలి దశలోని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా పెద్ద నేరాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉందన్నారు. ఇది తన స్వీయ అనుభవంలో నేర్చుకున్నానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మీడియాకు పాత్ర ఉందని, మీడియా కూడా పోలీసులకు సహకారం అందివాలని కోరారు. తన అధికారిక సెల్ నెంబర్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్య ఎదురైనా తనకు నేరుగా ఫోన్ చేయవచ్చన్నారు. పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

విక్రాంత్ పాటిల్ గురించి: విక్రాంత్ పాటిల్ 2012 బ్యాచ్ అధికారి తమిళనాడు రాష్ట్ర కేడర్ కు ఎంపికైన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ అయ్యారు. 2016లో తుళ్లూరులో ఎఎస్పిగా, 2017లో పార్వతీపురం ఒఎస్‌డిగా పనిచేసి ఎస్పిగా పదోన్నతి పొందారు. 2018లో చిత్తూరు జిల్లా ఎస్పిగా, ఆ తర్వాత 2019 లో విశాఖపట్నం డిసిపిగా, గుంతకల్లు రైల్వే ఎస్పిగా, విజయవాడ డిసిపిగా, 2021 లో విజయనగరం 5వ ఎపిఎస్‌పి బెటాలియన్, 2023లో పార్వతీపురం మన్యం ఎస్పిగా పనిచేశారు. 2024 లో ఎపిఎస్‌పి 3వ బెటాలియన్ కాకినాడ కమాండెంట్‌గా, ఆ తర్వాత కాకినాడ జిల్లా ఎస్పిగా పనిచేసి ప్రస్తుతం బదిలీపై కర్నూలు జిల్లాకు వచ్చారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పిలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, ఆర్ ఎస్సైలు, డిపిఒ సిబ్బంది నూతన జిల్లా ఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త బాదుడు..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మరో కొత్త బాదుడు వేసింది. భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచేసింది. నూతన సంవత్సరం ఆరంభం నుంచే పెంచిన భూముల విలువను అమలు అమలు చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల దాన్ని ఫిబ్రవరి 1నుంచి అమలు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల విలువలు అమాంతంగా పెంచేశారు. ఇప్పటికే భూముల విలువ ఎక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 15 శాతానికి తక్కువ కాకుండా పెంచాలని, భూముల విలువ తక్కువగా ఉందనుకునే ఏరియాల్లో 45 శాతం వరకు పెంచాలన్న సర్కారు నిర్ణయం మేరకు పెంపుదల చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని భూముల విలువను అమాంతంగా 45 శాతం వరకు పెంచారు.కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు విలువనూ పెంచారు. పట్టణాల్లోని అపార్టుమెంట్లలోని ప్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువ రూ.900 నుంచి రూ.1,400 వరకు పెరిగింది. ప్రాంతాల వారీగా స్థలం విలువలను బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదాయం కోసం మార్కెట్ విలువను పెంచడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కర్నూలు నగరంలోని విద్యా నగర్, మేడం కంపౌండ్ ప్రాంతాల్లో గజం భూమి విలువ దాదాపు రూ.45 వేల వరకూ ఉంది. ప్రస్తుతం అక్కడ 15 శాతం పెంచితే రూ.6,750 వరకూ రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతుంది. భూమి విలువ గజానికి రూ.52,750కు చేరుతుంది. నంద్యాల పట్టణంలోని కల్పనా సెంటర్, షరాఫ్ బజార్, శ్రీనివాస నగర్ ప్రాంతాలలో ప్రస్తుతం గజం విలువ రూ.25 వేలు ఉంది. 10 నుంచి 20 శాతం పెంచితే గజానికి రూ.5వేలు పెరగనుంది. గజం భూమి విలువ రూ.30వేలకు చేరనుంది. ఇలా అన్ని ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. క్రయ విక్రయాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో భూమి, స్థలాల విలువలు తప్పనిసరిగా పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

స్మార్ట్ దోపిడీ : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటి వరకూ 63 వేల స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానంలోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటరకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

ఎపి శాప్ చైర్మన్ రవి నాయుడు

ప్రజాశక్తి-పత్తికొండ: యువతకు విద్యతోపాటు క్రీడలు కూడా మానసిక విల్లాసాన్ని కలిగిస్తాయని ఎపి శాప్ చైర్మెన్ రవినాయుడు పేర్కొన్నారు. శనివారం పత్తికొండ కెఇ మాదన్న స్మారక జ్ఞాపకార్ధకంగా సౌత్ ఇండియా టి20 లెవెల్ క్రికెట్ టోర్నమెంట్‌ను పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు, జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడారు. పత్తికొండ నియోజకవర్గంలోని సౌత్ ఇండియా టి20 లెవెల్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయడం కోసం క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర జిల్లా స్థాయిల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిభ కనబరిచిన వారికి నగదు తో పాటు బహుమతులు కూడా అందజేస్తున్నారని తెలిపారు. క్రీడాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, టిడిపి నాయకులు సాంబశివారెడ్డి, బత్తిని వెంకటరాముడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, కెపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్, సౌత్ ఇండియా టి20 ఆర్గనైజేషన్ కందనాతి సుంకన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి శాప్ చైర్మన్ రవి నాయుడు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి

ప్రతి గ్రామానికి సాగు, తాగునీరివ్వాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగు,తాగునీరు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండ సిపిఎం నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పత్తికొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా ప్రతి గ్రామానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. పత్తికొండ పట్టణంలోని జనాభా రోజు రోజుకు పెరగడంతో ట్రాఫిక్ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కనీస సౌకర్యాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ రంజిత్‌బాష సానుకూలంగా స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం మండల కమిటీ నాయకులు రంగారెడ్డి, గోపాల్ ,తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వైద్య విధానం తనిఖీ

నోడల్ అధికారి డాక్టర్ రఘు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

బిపి చెక్ చేస్తున్న డాక్టర్ రఘు

జిల్లా సంచార చికిత్స కార్యక్రమాన్ని నోడల్ అధికారి డాక్టర్ రఘు లద్దగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామాపురం గ్రామంలో జరుగుతున్న కుటుంబ వైద్య విధానం కార్యక్రమాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణమనిమన్నారు. సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయమంతో రక్తపోటుకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చునని అన్నారు. రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం ధూమపానం కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని అన్నారు. ఉప్పు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు వినియోగించుకోవాలన్నారు. పాలు, గుడ్లు, పండ్లు, పొడి ధాన్యాలు ఆకుకూరలు మొదలైన పోషక విలువలు కలిగిన ఆహారాలు తీసుకోవాలని తెలిపారు. రక్తపోటు నివారణ లక్షణాలు చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, సామాజిక ఆరోగ్య అధికారి శాంత, రేష్మ, జయకుమార్, మగ ఆరోగ్య కార్యకర్త , ఖలీల్ పాల్గొన్నారు.

క్రీడా కేంద్రంగా కర్నూలు అభివృద్ధి

-శాప్ చైర్మన్ రవినాయుడు
-డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీని సందర్శించిన శాప్ చైర్మన్ ,ఎంపీ
-డిఎస్ఎ నిర్వహణ పట్ల అసంతృప్తి
-డిఎస్‌డిఒ పనితీరుపై ఆగ్రహం -పనితీరు మార్చుకోవాలని హెచ్చరిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

వెనుకబడిన కర్నూలు జిల్లాలో మెరుగైన క్రీడావసతులు ఏర్పాటు చేసి కర్నూలు జిల్లాను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎపి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు, ఎంపి బస్తిపాటి నాగరాజు శనివారం సందర్శించారు. తొలుత డిఎస్ఎ ముఖద్వారం వద్ద ఉన్న హాకీ క్రీడాకారుడు పద్మశ్రీ ధ్యాన్‌చంద్ విగ్రహానికి వారిరువురూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఎస్ఎలోని అవుట్‌డోర్ స్టేడియం, జిమ్నాస్టిక్స్ ట్రైనింగ్,ఇండోర్ హాలును పరిశీలించారు. డిఎస్ఎలో విధుల నిర్వహణ, అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ, క్రీడావసతుల కల్పనపై డిఎస్ఎ అధికారులతో శాప్ చైర్మన్ ఆరా తీశారు. అస్తవ్యస్థంగా ఉన్న డిఎస్ఎ నిర్వహణ పట్ల శాప్‌చైర్మన్ అసంతృప్తి చెందారు. ఇండోర్ స్టేడియంలో టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, పారిశుధ్య నిర్వహణ పడకేసిందని అసహనం వ్యక్తం చేశారు. కర్నూలు డిఎస్‌డిఒ బి.భూపతిరావు, డిఎస్ఎ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అత్యుత్తమ క్రీడావసతులను ఏర్పాటు చేసి కర్నూలు స్టేడియాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ క్రీడాపోటీలు జరిగినా అక్కడ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి క్రీడాకారులు ఉంటారన్నారు. క్రీడలకు పేరుగాంచిన కర్నూలులో క్రీడాకారులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కర్నూలులో క్రీడల అభివృద్ధిపై మంత్రి టిజి. భరత్, ఎంపి నాగరాజు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, వారిరువురి సహకారంతో ఆదర్శవంతంగా కర్నూలు స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామని శాప్ ఛైర్మన్ హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లాలో స్టేడియం నిర్మాణాలకు జోహారపురం, వాటర్ వర్క్స్ వద్ద రెండు స్థలాలను గుర్తించామని, వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి త్వరలోనే ఎంపీ, మంత్రుల సాయంతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లను వైసిపి నాయకులు కొల్లగొట్టారన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమని, కర్నూలు క్రీడాకారులకు మెరుగైనన క్రీడాసదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కర్నూలు డిఎస్ఎ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలతో డిపిఆర్‌లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాబుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో క్రీడారంగం నిర్వీర్యమైందన్నారు. వెనుకబడిన కర్నూలు జిల్లాలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కర్నూలు డిఎస్ఎలోని స్టేడియాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టేడియం అభివృద్ధికి శాప్ సహకరించాలని, ఎంపిగా తన వంతుగా చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు క్రీడాకారులు, క్రీడా సంఘాల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు శాప్ ఛైర్మన్‌ను ఘనంగా సత్కరించారు. పలువురు క్రీడాకారుల నుంచి శాప్‌చైర్మన్ వినతులు స్వీకరించారు.

ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రవినాయుడు, ఎంపి

పేదలకు భరోసా సామాజిక పింఛన్లు

ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. పేదలకు సామాజిక భరోసా ఇచ్చేది ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగ శేషాచల రెడ్డి, గ్రామ సచివాలయం ఉద్యోగులు, గ్రామ ముఖ్య నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం : కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ జాతీయ రహదారి పక్కన ఉన్న నూతన మారుతి వెంకటేశ్వరా ఫిల్లింగ్ స్టేషన్, భారత్ పెట్రోల్ బంకును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించిన గౌరు చరిత: కల్లూరు మండలం చిన్నటేకూరులో వసంత పంచమి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ప్రైమరీ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన సరస్వతి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్కూల్ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు

చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న గౌరుచరిత

రజకులకు రక్షణ చట్టం అవసరం

రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేసి, రజక కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మిక కర్షక భవనం దగ్గర ఐలమ్మ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూల్ జిల్లా సంఘం న్యూ సిటీ అధ్యక్షుడు సి.రాముడు అధ్యక్షతన మాడివాళ. మాచిదేవ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా మాడివాళ మాచిదేవ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు అర్పించారు. అనంతరం న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి ,ఓల్డ్ సిటీ కార్యదర్శి సి హెచ్ శ్రీనివాసులు, అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ మాడివాళ .మాచిదేవ గురుంచి మనమందరం తెలుసుకొని వారి సేవలను స్ఫూర్తిగా దీసుకొని కొంతైనా రజక వృత్తిదారులకు ఉపయోగ పడేలా పని చేయలని ,వారి ఆదర్శం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా తిసుకోవలన్నారు. జిఒ నంబర్ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం, అనేక సంఘాల రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేసే విధంగా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా నాయకులు సాయిబాబా ,నరసింహులు ,మద్దిలేటి, కర్రెన్న , ఎల్లయ్య, శీను, నెట్టుకంటయ్య ,సి .శీను , మధు, రాజు పాల్గొన్నారు.



మాడివాళ మాచిదేవకు నివాళి అర్పిస్తున్న ఆర్‌విఎస్ నాయకులు

ప్రజల పక్షాన వైసిపి పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల కృష్ణానగర్‌లో శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాలులో వైసిపి జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల చేత పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం చేయించారు.వైసిపి రాష్ట్ర నాయకులు సతీష్‌రెడ్డి, పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.రాంభూపాల్ రెడ్డి, ఎస్‌వి.మోహన్ రెడ్డి కెడిసిసి బ్యాంక్ మాజీ ఛైర్పర్సన్ ఎస్‌వి.విజయ మనోహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగన్మోహన్ రెడ్డిని రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఏకమై కుట్రతో ఓడించారని విమర్శించారు. ఇదే సందర్భంలో రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం, జీతాలు పెంచుతామని చెప్పినా వాలంటీర్లకు ఇంతవరకు తీసుకోకపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. వైసిపి ప్రజాపక్షం ప్రజా పార్టీ అని ప్రజా సమస్యలను ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో వెనుకడుగు వేయదని జిల్లా అధ్యక్షులు ఎస్‌వి. మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి అన్నారు. కొత్తగా నియమించిన వారి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్ష, మేయర్ బివై.రామయ్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, సాయి ప్రసాద్ రెడ్డి, కోట్లహర్ష వర్ధన్ రెడ్డి, సతీష్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి , సర్పంచి సీలమ్మ

ఎమ్మెల్యే దస్తగిరి పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆయన తల్లి సర్పంచి సీలమ్మతో కలిసి కర్నూలు రూరల్ మండలం సూదిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలనుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజులో 65 లక్షల మందికి రూ.2730 కోట్ల పింఛన్ల మొత్తాన్ని అవ్వ తాతలకు, వికలాంగులకు, వితంతువులకు పంపిణీ చేశారన్నారు. భర్త చనిపోతే అదే నెలలోనే భార్యకు పింఛను మంజూరు చేసిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలకు సర్పంచి, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ ఎఇ, పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి ప్రారంభించారు. టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు పాల్గొని పింఛను పంపిణీ చేశారు.

నైపుణ్య పరీక్షల్లో మత్స్యకారులు

బడుగు, బలహీన వర్గాల బలోపేతానికి సంఘాలు

- డిఎఫ్‌సిఎస్ ఛైర్మన్ నవీన్ కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మత్స్యకారుల సంఘాలు ఏర్పాటు చేయనున్నట్లు డిఎఫ్‌సిఎస్ ఛైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని కరివేముల గ్రామ నల్ల చెరువులో నూతన మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయడానికి గ్రామ పరిధిలోని మత్స్యకారులకు ఐదు రకాల నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. త్రీమెన్ కమిటీ సభ్యులుగా డిఎఫ్‌సిఎస్ ఛైర్మన్ బిఎస్.నవీన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ సంధ్యారాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ వై.ఉమాదేవి సమక్షంలో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, వారికి అన్ని విధాలుగా సహకరించేందుకు నిరంతరం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. మత్స్యకారులంతా ఐకమత్యంతో ఉండి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సర్పంచి రంగమ్మ మరిది శ్రీనివాసులు, మత్స్యశాఖ అధికారులు రామన్న, చంద్రయ్య, అరుణ క్రాంతి, కోఆపరేటివ్ అధికారులు వెంకటసుబ్బయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

- ఎపిఒ రామకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ రామకృష్ణ

జాబ్ కార్డు ఉండి పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఎపిఒ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని యాటకల్లు, తొగలగళ్లు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లాలన్నారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు కూలి రూ.280 నుంచి రూ.300 పడుతుందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉపాధి పనులు కల్పిస్తోందని, వలస వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి పనులు చేసుకోవాలని తెలిపారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ పనులు పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

విరమణ ఎంఇఒ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

సన్మానం చేస్తున్న సభ్యులు

పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం విరమణ పొందిన ఎంఇఒ నాగేశప్ప దంపతులను ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన నాగేశప్ప ఆలూరు తాలూకా చిప్పగిరి ఎంఇఒగా పని చేస్తూ శుక్రవారం విరమణ పొందారు. శనివారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బసవరాజ్, సతీష్, ఇర్ఫాన్, వెంకటేష్ నాయక్, మణికంఠ, మల్లి, లింగ తదితరులు విరమణ పొందిన దంపతులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానం చేశారు.

'ఉర్దూ పాఠశాలలను విలీనం చేయవద్దు'

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని ఉర్దూ పాఠశాలను తెలుగు మీడియంలో విలీనం చేయవద్దని ఆలూరు ముస్లిం, మైనార్టీ పెద్దలు నబీ రసూల్, పాఠశాల ఛైర్మన్ షేక్షావలీ, వైస్ ఛైర్మన్ షేకున్ బీ కోరారు. శనివారం ఆలూరు ఎంఇఒ-2 చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా.. పిల్లలు తక్కువ ఉన్నారనే సాకుతో ఉర్దూ మాధ్యమం పాఠశాలలను ఇతర మాధ్యమ పాఠశాలలోకి కలిపి వేయడం సరైన పద్ధతి కాదన్నారు. పాఠశాలలపై పర్యవేక్షణ చేయడం మానేసి ముస్లిం, మైనారిటీలకు ఉర్దూ విద్యను అందని ద్రాక్షగా చేయడం కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకొని ఉర్దూ మాధ్యమ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎస్‌ఎం.నూర్జహాన్, నూర్ మహ్మద్, అబ్దుల్ రహమాన్, విజయలక్ష్మి, మున్ని పాల్గొన్నారు.

ఎంఇఒ చిరంజీవికి వినతిపత్రం అందిస్తున్న ముస్లిం, మైనార్టీలు

2,39,332 మంది పింఛనుదారులకు

రూ.102.89 కోట్లు పంపిణీ

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి- దేవనకొండ

ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకం కింద ఫిబ్రవరిలో జిల్లాలో అర్హులైన 2,39,332 మంది లబ్ధిదారులకు రూ.102.89 కోట్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం దేవనకొండ మండలం కరివేముల గ్రామ సచివాలయ పరిధిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛను పథకం కింద కిడ్నీ వ్యాధిగ్రస్తులు గుర్రం కిరణ్, గిరిధర్, వికలాంగ పింఛను రాజగోపాల్, వృద్ధాప్య పింఛను రంగన్న, వితంతు పింఛను జయమ్మ ఇంటి వద్దకెళ్లి కలెక్టర్ అందజేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు గుర్రం కిరణ్, గిరిధర్‌కు పింఛను అందజేస్తూ కలెక్టర్ వారి బాగోగులు తెలుసుకున్నారు. వైద్య సేవలు ఎక్కడ చేయించుకుంటున్నారని, వారంలో ఎన్ని సార్లు చేయించుకుంటున్నారని, ఆరోగ్యశ్రీ కింద చేయించుకుంటున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ పథకం కింద గౌరీ గోపాల్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుంటున్నామని, వారంలో మూడు లేదా నాలుగు సార్లు వైద్యం చేయించుకునేందుకు వెళ్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. అలాగే వికలాంగ పింఛను రాజగోపాల్, వితంతు పింఛను జయమ్మకు అందజేస్తూ... పింఛను ప్రతినెలా 1వ తేదీ నాటికి అందిస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం కరివేముల సర్పంచి రంగమ్మ కుమారుడు శ్రీనివాసులుతో మాట్లాడుతూ... వ్యవసాయం గురించి ఆరా తీశారు. ఇక్కడ ప్రధానంగా ఏ పంటలు పండిస్తారని, ఏ సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ భవన నిర్మాణం మధ్యలో ఆగిపోయిందని, గ్రామానికి లక్ష లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ కావాలని, గ్రామంలో కొత్త కాలనీలు ఉన్నాయని, వాటికి సిసి రోడ్లు కావాలని సర్పంచి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, డిఆర్‌డిఎ పీడీ శివ నాగలీల, డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనం, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సూర్యనారాయణ, వెలుగు ఎపిఎం నరసన్న, విఆర్‌ఒ రాజన్న, పంచాయతీ కార్యదర్శి విమల, టిడిపి నాయకులు గిడ్డయ్య గౌడు, వీరేష్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

సర్వర్లు మొరాయించినా

94 శాతం పింఛన్లు పంపిణీ

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎంపిడిఒ అల్లాబకాష్

మండలంలో సర్వర్లు మొరాయిస్తున్నప్పటికీ తొలి రోజున దాదాపు 94 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. శనివారం చిప్పగిరిలో పింఛన్ల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 3,439 పింఛన్లకు గాను 94 శాతం పూర్తయిందన్నారు. పొలాలకు వెళ్లిన వారు, అందుబాటులో లేనివారు మాత్రమే పింఛన్లు తీసుకోలేదన్నారు. వారికి సోమవారం ఇస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం : మండలంలో బీసీ కార్పొరేషన్ కింద రుణాలు తీసుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ అల్లా బకాష్ తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాలు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవడానికి ఒబిఎంఎంఎస్ సైట్ ఓపెన్ అయిందని, అర్హత ఉన్నవారు సచివాలయ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు సచివాలయంలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు.

మహా కుంభాభిషేకం పూజలు ప్రారంభం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మహాకుంభాభిషేకం పూజలు శనివారం డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో వేద పండితులతో ప్రారంభమయ్యాయి. రాజగోపురాలపై ప్రతిష్టాపన కోసం చేయించిన కలశాలకు స్వామి వారి సన్నిధిలో ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వేద పండితులు మురళీకృష్ణ శర్మ, ఉప ప్రధాన అర్చకులు మహదేవ, పూజన్న, ముఖ్య అర్చకులు నాగరాజు, శివన్న, అర్చకులు మల్లయ్య, ఈరన్న పూజలు చేశారు.

అభివృద్ధికి సహకారం ఉంటుంది : టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారం నిరంతరం ఉంటుందని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మహా కుంభాభిషేకం కార్యక్రమం భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించిందని పేర్కొన్నారు. కుంభాభిషేకం ప్రారంభోత్సవంలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. రాఘవేంద్ర రెడ్డి సతీమణి యశోద, రఘునాథ్ రెడ్డి, సతీమణి చంద్రిక, రామకృష్ణా రెడ్డి, సతీమణి భారతమ్మ, రాకేష్ రెడ్డి, చూడి నరేష్, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, చిన్న, రాజానందన్, చిరంజీవి, మహాదేవ నాయుడు, గట్టూరి ఈరన్న పాల్గొన్నారు.

కల్పవృక్ష కార్యక్రమం : పుణ్యక్షేత్రంలో వేద పండితుల ఆధ్వర్యంలో కల్పవృక్ష కార్యక్రమం నిర్వహించారు. పాత రాజగోపురంపై కలశాలకు పూజలు చేసి తొలగించారు.

కలశాలను తీసుకొస్తున్న రాఘవేంద్రరెడ్డి, అర్చకులు

పూజల్లో పాల్గొన్న నాయకులు, అర్చకులు

పూజలు చేస్తున్న అర్చకులు

'సూపర్ సిక్స్'కు కట్టుబడి ఉన్నాం

- టెక్స్ టైల్ పార్కు, నేషనల్ హైవే, రైల్వే లైన్ ప్రాజెక్టులు తీసుకొస్తున్నాం
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వైసిపి నాయకుల ఆరోపణలను ప్రజలు ఎవరూ నమ్మేస్థితిలో లేరని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 4వ వార్డు, 23వ వార్డులో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో ఏ రోడ్డు చూసినా తన తండ్రి, మాజీమంత్రి బీవీ.మోహన్ రెడ్డి గుర్తుకొస్తారని, సంక్షేమం, అభివృద్ధి దశగా ముందుకు పోతున్నామని తెలిపారు. 4వ వార్డులో 30 ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం చూపి కొత్త రోడ్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెక్స్ టైల్ పార్కు ఏర్పాటయితే యువతకు ఉద్యోగావకాశాలు, చేనేత కార్మికులకు పని దొరుకుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఈ పార్కు స్థలాన్ని పట్టాలిచ్చి నాశనం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 77 ఎకరాల్లో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుకు మంజూరు చేసి తీసుకొచ్చానని పేర్కొన్నారు. త్వరలోనే తల్లికి వందనం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు వయా మంత్రాలయం మీదుగా ఎమ్మిగనూరుకు రైల్వే లైన్ అప్రూవల్‌కు తొలి అడుగు పడిందన్నారు.

పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మరో వైపు ఎమ్మిగనూరు - కర్నూలు నేషనల్ హైవేగా ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి కౌన్సిలర్లు రాందాస్ గౌడ్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రతాప్, ఉరుకుందయ్య శెట్టి పాల్గొన్నారు. అలాగే టిడిపి 30వ వార్డు నాయకులు విజయలక్ష్మి ఇంటింటికి వెళ్లి పింఛను అందజేశారు. వార్డులో ఏ సమస్యలున్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. **హోళగుందలో** టిడిపి నాయకులు చిన్నహ్యాట శేషగిరి పంఛన్లను పంపిణీ చేశారు. టిడిపి యువ నాయకులు ఖాదర్ బాషా, కె.మల్లికార్జున పాల్గొన్నారు.


హోళగుందలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పింఛన్లు పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

రేషన్ కార్డుదారులు మ్యాపింగ్ చేసుకోవాలి

- డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని రేషన్ కార్డుదారులు మ్యాపింగ్ చేసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. గతంలో రేషన్ కార్డులో లేనివారు, కొత్తగా రేషన్ కార్డు నమోదు చేసుకున్న వారు సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, విఆర్‌ఒలతో మ్యాపింగ్ చేసుకోవాలన్నా రు. 3,081 మందిలో 1,363 మంది మ్యాపింగ్ చేసుకున్నారన్నారు. మిగిలిన 1,718 పెండింగ్‌లో ఉన్నారన్నారు. చాలామంది గ్రామాల్లో వలసలు వెళ్లడంతో, మ్యాపింగ్ ఇబ్బందిగా మారిందని తెలిపారు. వలసలకు వెళ్లినవారు ఆధార్ కార్డులో ఫోన్ నెంబర్ లింక్ అయిన వారు ఫోన్ నెంబర్ ద్వారా కూడా లింక్ చేసుకోవచ్చన్నారు. మ్యాపింగ్ చేసుకుంటేనే రాబోయే కొత్త రేషన్ కార్డులో పేర్లు నమోదు చేయవచ్చన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జ్యోతి ములిమణి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జ్యోతి ములిమణి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, నరసింహ దేశాయ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు.

'విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు'

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఎస్‌టియు రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు సంబంధించి కేవలం 2.5 శాతం నిధులు (రూ.1,28,650 కోట్లు) మాత్రమే కేటాయించడం సబబు కాదన్నారు. ఇది గతేడాది కంటే 0.03 శాతం తక్కువని, జిడిపిలో 6.5 శాతం నిధులు కేటాయించాలని తెలిపారు. ఆదాయ పన్నుకు సంబంధించి రూ.12 లక్షల్లోపు ఆదాయానికి కొంత రిబేట్ కల్పించడం ఊరట కలిగించే అంశమని చెప్పారు. పాత పన్ను విధానంలో 80సి కింద పొదుపులు కానీ ప్రామాణిక తగ్గింపు విషయంలో కానీ ఎలాంటి మార్పులూ చేయలేదని తెలిపారు. తప్పనిసరిగా అందరూ కొత్త పన్ను విధానాన్నే ఎంచుకోవాల్సి వస్తుందని తెలిపారు.

'సూపర్ సిక్స్'కు ముందడుగు

- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేశారని టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, గుంతకల్ అబ్బర్వర్ గడ్డా ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. గతనెల 31న టిడిపి పొలిట్ బ్యూరో సమావేశంలోనే సూపర్ సిక్స్ పథకాల అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారన్నారు.

చేతులెత్తేసిన ముఖ్యమంత్రి

- ఆలూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఆలూరు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే, చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి పాలన గత వైసిపి పాలన కంటే అధ్వానంగా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారి పోయిందని, గాడిలో పెట్టేందుకు కొంత సమయం పడుతుందని, అంత వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేమని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు మొలగవెల్లి పూల రామాంజనేయులు, చిప్పగిరి మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, ఉపాధ్యక్షులు కరెంటు గోవిందు, సీనియర్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, లింగంపల్లి హనుమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, వీరాంజనేయులు, ఆంథోని, రామాంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వైసిపి మండల అధ్యక్షులుగా ప్రహ్లాద చారి

ప్రజాశక్తి - కౌతాళం

వైసిపి మండల అధ్యక్షులుగా దేశాయ్ ప్రహ్లాద చారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ... మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబ సహకారంతో ఈ పదవి వచ్చిందని, ఆ కుటుంబం నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వైసిపి అభివృద్ధికి పని చేస్తామని తెలిపారు.

నాయకుల హర్షం : దేశాయ్ ప్రహ్లాద చారి వైసిపి మండల అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి అవతారం, ఉప సర్పంచి తిక్కయ్య, నాయకులు అనిల్ కుమార్, రామస్వామి, శ్రీకాంత్, ధర్మన్న, చూడి రమేష్, చూడి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రహ్లాద చారి

వైసిపి జిల్లా కార్యదర్శిగా

బందే నవాజ్ ప్రమాణ స్వీకారం

- అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మాజీ కోఆప్షన్ సభ్యులు, ఎంపిపి టి.నసురుద్దీన్ తనయుడు టికె.బందే నవాజ్ వైసిపి జిల్లా కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం కర్నూలులో నిర్వహించిన వైసిపి జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, సీనియర్ నాయకుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి తనను ఈ పదవికి ఎంపిక చేసిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి, ఇన్‌ఛార్జీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎస్వీ.మోహన్ రెడ్డి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పెద్దలందరి సహకారంతో పార్టీ బలోపేతానికి, పార్టీని ముందుకు నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న బందేనవాజ్


దేవేంద్రప్పకు వినతిపత్రం ఇస్తున్న దస్తగిరి నాయుడు

రూ.896 కోట్ల సబ్సిడీ రుణాలు

- దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.896 కోట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందని, ఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కురుబ/కురుమ కార్పొరేషన్ ఛైర్మన్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, సంఘం గౌరవాధ్యక్షులు, ఆత్మ మాజీ ఛైర్మన్ ఫక్రుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆంధ్రప్రదేశ్ బీసీ ఫెడరేషన్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని 26 మండలాల్లో 484 పంచాయతీలకు 1,673 యూనిట్లు మంజూరయినట్లు చెప్పారు. 484 పంచాయతీలకు గాను ఒక్కో గ్రామానికి కేవలం 3, 4 యూనిట్లు మాత్రమే మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 10 కులాలు ఉంటాయని తెలిపారు. బీసీలోని ప్రతి కులానికీ ఒక యూనిట్ వచ్చే విధంగా కలెక్టర్, సబ్ కలెక్టర్ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి చేరే విధంగా చేస్తారని ఆశిస్తున్నామన్నారు. కనీసం 5 వేల యూనిట్లకు పెంచాలని కోరారు. డివిజన్ నాయకులు కత్తి హనుమంతురావు, పట్టణ జనరల్ సెక్రటరీ బి.మల్లేశ్వరప్ప, బి.సంజీవ్, బలాదూర్ బజారప్ప ఉన్నారు.

ఘనంగా మాచిదేవ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మండల రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీమడివేల మాచిదేవ జయంతి వేడుకలు నిర్వహించారు. కురుకుంద నాగరాజు, మంగయ్య, లక్ష్మణ, ఎల్ఐసి మల్లికార్జున, నాగరాజు, శివ, కరెంటు మల్లికార్జున, ఎల్లప్ప, నాగేంద్ర, రమేష్, రాజ, గాదిలింగ, యశ్వంత్, రాజశేఖర్ పాల్గొన్నారు. **మంత్రాలయంలో** రజకుల ఆరాధ్య దైవమైన మడివాళ మాచిదేవ జయంతి నిర్వహించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఉన్న మాచిదేవ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోస్టు భీమయ్య, పెద్ద రాఘన్న, చిన్న రాఘన్న, ఎల్లప్ప, రమేష్, దుళ్లయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి : డిఎల్‌పిఒ నూర్జహాన్

ప్రజాశక్తి - హోళగుంద

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

పారిశుధ్యంపై దృష్టి సారించాలని డిఎల్‌పిఒ నూర్జహాన్ అధికారులకు సూచించారు. శనివారం ఓ ఫిర్యాది విచారణలో భాగంగా హోళగుందకు వచ్చిన ఆమె స్థానిక మేజర్ పంచాయతీలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం దోమలు అధికంగా ఉండడంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. అపరిశుభ్రత కారణంగా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, తగిన మందులు పిచికారి చేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచి రంగమ్మ తనయుడు పంపాపతి పాల్గొన్నారు.

అలారుదిన్నె బ్రిడ్జికి మరమ్మతులు

- ఐదు రోజులు రాకపోకలు బంద్

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని అలారుదిన్నె బ్రిడ్జికి రంధ్రం పడడంతో ఐదు రోజులపాటు రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేవనకొండ క్రాస్ రోడ్డు నుంచి ఆస్పరి, ఆలూరు, ఆదోని వెళ్లేవారు పత్తికొండ రహదారి వైపు వెళ్లిపోవాలని రోడ్లు, భవనాల అధికారులు శనివారం తెలిపారు. బ్రిడ్జి మధ్యలో పగిలిపోయి క్రాక్ ఇచ్చిందని, మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం నుంచి ఐదు రోజుల వరకు ఏ వాహనమూ ఇటు వెళ్లకూడదని తెలిపారు. ఆదివారం నుంచి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆస్పరి, ఆదోని, ఆలూరు రూట్‌లో వెళ్లే వాహనాలు దేవనకొండ నుంచి పత్తికొండ వైపు వెళ్లాలని కోరారు.

భవిష్యత్తు పరిరక్షణలో కూటమి విఫలం

- వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ విమర్శించారు. శనివారం వైసిపి కార్యాలయంలో 'ఫీజు పోరు' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బుట్టా శివ నీలకంఠ, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. ఫీజు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు అనుమతించడం లేదన్నారు. పేద కుటుంబాల విద్యార్థులు అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. వైసిపి పట్టణ నాయకులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, సునీల్ కుమార్, గడ్డం నారాయణరెడ్డి, చాంద్ బాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

- 7న 'చలో హైదరాబాద్' : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్సీ వర్గీకరణ అమలు చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు, వేల గొంతులు' కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని తెలిపారు. శనివారం పట్టణంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు జి.ఆనంద్ చైతన్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు గంజిహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగలు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలు, ఉపకులాల్లో వెలుగు వచ్చిందని తెలిపారు. కొందరు స్వార్థపరులు బహిరంగంగా వ్యతిరేకించడం సరైంది కాదన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే దుష్ట శక్తుల గుండెల్లో మాదిగ డప్పుల మోతలతో ఉక్కిరిబిక్కిరి చేస్తామన్నారు. లక్షల డప్పుల మాదిగల మండే గుండె చప్పుళ్లు హైదరాబాద్‌కే కాదు ప్రపంచానికి వినిపించేలా తెలుగు రాష్ట్రాల్లోని మాదిగలు ప్రతి ఇంటి నుంచి డప్పులతో కదిలి రావాలని కోరారు. 7న ఉదయం 11 గంటలకు హైదరాబాదులోని ఎల్‌బి స్టేడియం నుంచి ప్రదర్శన ప్రారంభమై పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు హాలహర్వి దావీదు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఇఎఫ్) నాయకులు టీచర్ హంపయ్య, ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య అధ్యక్షులు గుడికల్ స్వామి దాస్, ఎంఆర్‌పిఎస్ నాయకులు గోనెగండ్ల నరసింహులు మాదిగ, గంజహళ్లి జెస్వాన్ మాదిగ, కంబాలదిన్నె శ్యామ్సన్ మాదిగ, కందనాతి దేవదాసు మాదిగ, గార్లదిన్నె పౌలయ్య మాదిగ, కారుమంచి రాముడు మాదిగ, కలుగొట్ల చిన్న మాదిగ, ముగతి నరసన్న మాదిగ, హాలహర్వి ఏసేపు మాదిగ పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT ADONI (SENIOR DIVISION)
I.A. No. 62/2012
In
OS. No. 32/2003

Bet.
P. Shakunthalamma Died by Lrs
..... petitioners
V/S
P. Gopal Died and no issues
.... Respondent

To,
Whom so ever it may concerned,

The petitioners have filed a final decree petition against the respondent P. Gopal who died on. 02-11-2022. His wife also diet! on, 31-10-2022 and no issues. The petitioner P. Shakunthalamma died on. 01-08-2021 during the pendency of the final decree and remaining petitioners are two sisters and one brother namely P. Veeresh who are entitled three shares in the petition schedule house property.Take notice that if anybody is having any right or interest in the schedule house property they may appear before the above said court on. 16.02.2025 at about 10.30 am, if no one will appear in the said final decree petition the matter may be decided according to law and allotted three equal shares in favour of the petitioners.

SCHEDULE

House No.21/515/184, an Extent at 2.42 cents Ambedkar Nagar, Adoni Mandal, Kurnool District,

Boundaries:-
East-Balaji Hut,
West: Lakshmi Venkateshwara Medical Store,
North-Road,
South-Vanka.

"By Order of the court"
M. YASEEN BASHA,
Advocate for petitioners
Cell: 7901558842